

బిల్లులు అడిగి తీసుకోండి

డి.పుల్లయ్య, వ్యవసాయశాఖ జేడీ, ఖమ్మం

ప్రశ్న: ఫెర్టిలైజర్ దుకాణాలకు అనుమతి ఎలా ఇస్తున్నారు?
జవాబు: బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన వారు ఫెర్టిలైజర్ దుకాణాలను ఏర్పాటు చేయవచ్చు. పురుగుమందులపై వారికి మాత్రమే అవగాహన ఉంటుంది. అర్హులైన వారికే అనుమతి ఉంటుంది.


ప్ర: పురుగుమందుల వల్ల నష్టపోయిన సంఘటనల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
జ: రైతులకు సందేహాలుంటే వ్యవసాయ అధికారులను పురుగుమందుల గురించి అడగాలి. పంటలు నష్టపోయిన సందర్భాలలో పురుగుమందుల డీలర్లతో పాటు కంపెనీలపై చర్యలు తీసుకుంటాం. అనుమతి ఉన్న పురుగుల మందులనే విక్రయించాలి.

ప్ర: పురుగుమందుల విక్రయాలపై మార్గదర్శకాలేంటి?
జ: రైతులు కొనుగోలు చేసినప్పుడు వ్యాపారులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి. రైతులు కోరిన పురుగుల మందులు మాత్రమే విక్రయించాలి. వ్యాపారం కోసం పురుగుమందులను సొంతంగా అంటగట్టకూడదు.

ప్ర: రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?
జ: రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ సీజన్‌లో ఏయే పంటలకు ఎలాంటి పురుగుమందులు వాడాలో చెబుతున్నాం. క్షేత్రపర్యటనల్లో సత్వర పరిష్కారాలు సూచిస్తున్నాం. అధికారులు, శాస్త్రవేత్తలతో పంటలను పరిశీలిస్తున్నాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం వ్యవసాయం

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 28 అక్టోబరు 2024

కేటీపీఎస్‌కు ఊపిరి కిన్నెరసాని

- నీటి ఆధారంగా విద్యుదుత్పత్తి తొలిసారి మొదలైంది ఇక్కడే..
- 1962లో ప్రాజెక్టు నిర్మాణం.. రూ.5.58 కోట్ల వ్యయం
- 10వేల ఎకరాలకు సాగునీటి సరఫరా
- పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలకు తాగునీరు..

6



ప్రకృతి ఒడిపై పట్టింపేదీ?

- ఆధ్యాత్మికం, ఆహ్లాదాన్ని పంచుతున్న 'గుబ్బలమంగమ్మ' పరిసరాలు
- కలగానే పర్యాటక అభివృద్ధి
- ప్రకటనలకే పరిమితమవుతున్న నాయకుల మాటలు
- దశాబ్దాలు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులో అందమైన అడవి, జాలువారుతున్న జలపాతాలు, చుట్టు కొండల మధ్య స్వయంభూగా వెలిసిన 'గుబ్బలమంగమ్మ' అమ్మవారు ఉభయ రాష్ట్రాల భక్తులకు కొంగు బంగారం. నిత్యం ఈ ఆలయానికి ఉభయ రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఆదివారం వచ్చిందంటే ఈ ఆలయం పరిసరాల్లోని కొండలు, గుట్టలు, వాగులు పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతాయి. ఆధ్యాత్మిక శోభతోపాటు ఎంతో ఆహ్లాదకరమైన దృశ్యాలు, జలపాతాలతో గుబ్బల మంగమ్మ ఆలయం పరిసరాలు భక్తులకు తనివి తీరని అనుభూతినిస్తాయి. అందుకే అన్ని ఆలయాలకన్నా భిన్నంగా ఈ ఆలయానికి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత సాయంత్రం వరకు ఆ పరిసరాల్లోనే గడుపుతారు.

- ఆంధ్రజ్యోతి, అశ్వారావుపేట 6



గుబ్బల మంగమ్మ అమ్మవారు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- అదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు
- ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మహిళలకు ప్రత్యేకంగా ఎంఎస్‌ఎంఈ పార్క్‌లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇందుకోసం వచ్చే ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను అందించనున్నామని తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్, ఫ్రీ టీస్టాల్‌తో పాటు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహిళాలాంజ్, ఉద్యోగుల భోజనశాల, ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క





కలెక్టరేట్‌లో ఇందిరాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మహిళలకు వడ్డీలేని రుణాలు నిలిపివేశారని, ఇందిరమ్మ రాజ్యం రాగానే మహిళలకు వడ్డీలేని రుణాల కార్యక్రమాన్ని పునఃప్రారంభించామన్నారు. వడ్డీలేని రుణాలపై మహిళా సంఘాలకు సమాచారం అందించాలని, ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందన్నారు. బ్యాంకర్లు మహిళా సంఘాల నుంచి వసూలు చేయడానికి వీలులేదని డిప్యూటీ సీఎం తెలిపారు. గతంలో మాదిరిగా మహిళా సంఘాలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలకు ఇచ్చిన హామీని అమలు

మహిళలకు ఆదాయ వనరు చూపేందుకే మహిళా సంఘాలచే క్యాంటిన్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం ప్రతినెలా రూ.400కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మహిళల ఆధ్వర్యంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పన చేపట్టామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మహిళలకు ప్రత్యేకంగా చిన్న, చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో లోనూ మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇందిరా మహిళా సంఘాల సభ్యులతో డిప్యూటీ సీఎం ముచ్చటించారు. మహిళా సంఘాలకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలతో చేపట్టాల్సిన వ్యాపారాలు, లాభసాటిగా నిర్వహించడానికి చేపట్టాల్సిన చర్యలపై భట్టి విక్రమార్క వివరించారు. ఈ సందర్భంగా జుజ్జుల్ రావుపేటకు చెందిన రాణి తన వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన చేపలు, రొయ్యల చెరువు, పాడి, నాటుకోళ్ల ఫారం, గొర్రెల పెంపకం, కూరగాయలు, సేంద్రీయ వరి సాగు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ మృణాల్‌మిశ్రా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, డీఆర్డీవో సన్యాసయ్య, డీఆర్వో ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యాచకుడికి ఐపీ నోటీస్

- ఓ వ్యాపారికి రూ.50 వేలు అప్పుగా ఇచ్చిన బాధితుడు
- ఐపీ దాఖలు చేయడంతో నిండా మునిగిన యాచకుడు
- బోనకల్‌లో ఘటన



బాధితుడు అశోక్

బోనకల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బోనకల్‌లో ఓ యాచకుడికి ఐపీ నోటీస్ రావడం చర్చనీయాంశమైంది. బిక్షాటన చేసుకున్న డబ్బుతో పాటు తమ కుమార్తె ఓణీల కార్యక్రమం సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఇచ్చిన డబ్బును కలిపి సదరు యాచకుడు ఓ హోటల్ వ్యాపారికి అప్పుగా ఇవ్వగా సదరు వ్యాపారి ఐపీ దాఖలు చేయడంతో యాచకుడికి ఐపీ నోటీస్ ఇవ్వడంతో ఆయన కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద గొల్లాల అశోక్ దంపతులు సాయిబాబా ఆలయం ముందు బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం వారు ఇంటర్ (మిగతా 6వ పేజీలో)

ప్రతి ఒక్కరూ ధర్మపరిరక్షణకు పాటుపడాలి

- కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి
- నగరంలో ఘనంగా శోభాయాత్ర
- వేద విద్యార్థులకు యోగ్యతా పత్రాల అందజేత
- ముగిసిన తెలంగాణ వేద విద్వన్మహాసభలు

వివరాలు : 6లో



వేద విద్యార్థులకు యోగ్యతా పత్రాలు అందజేస్తున్న సచ్చిదానంద సరస్వతిస్వామి



తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో జరిగిన సభలో మాట్లాడుతున్న తమ్మినేని

కమ్యూనిస్టులంతా ఏకంకావాలి

- మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వివరాలు : 6లో

జల సిరి



కేటీపీఎస్‌కు ఊపిరి

కిన్నెరసాని



- నీటి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి తొలిసారిగా మొదలైంది ఇక్కడే..
- 1962లో ప్రాజెక్టు నిర్మాణం.. రూ.5.58 కోట్ల వ్యయం
- 10వేల ఎకరాలకు సాగునీటి సరఫరా
- పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలకు తాగునీరు..

పాల్వంచ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టును 1962లో రూ.5.58 కోట్లతో నిర్మాణం చేశారు. 1966 నాటికి పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు ఆధారంగా 1967లో కేటీపీఎస్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పి విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసి 58 సంవత్సరాలు కావస్తోంది. నాటి నుంచి నేటి వరకు కిన్నెరసాని ప్రాజెక్టు నీటిని విద్యుదుత్పత్తికి ఎటువంటి కొరత లేకుండా వాడుతున్నారు. తొలుత కిన్నెరసాని ప్రాజెక్టును బహుళార్థక ప్రాజెక్టుగా నిర్మాణం చేశారు. ఈ ప్రాంతంలోని సాగుభూములకు నీటిని అందిస్తూ పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడేవిధంగా రూపొందించారు. ప్రస్తుతం కేటీపీఎస్ 6, 7వ దశల్లో విద్యుత్ ఉత్పత్తితోపాటు మరో విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి సరిపడా నీరు పుష్కలంగా ప్రాజెక్టులో ఉంది.

నీరు రాక ఇలా..

వరంగల్ జిల్లాలోని పాకాల కొత్తగూడ, నర్సంపేటలోని అటవీ ప్రాంతం నుంచి ఆళ్లపల్లి, గుండాల ప్రాంతాల మీదుగా 30 కిలోమీటర్ల పొడవున ప్రవహించి కిన్నెరసానికి నీరు చేరుతుంది. ఈ నేపథ్యంలో 1961లో ఈ ప్రాంతంలో ప్రాజెక్టును నిర్మించాలని సాంకేతిక నిపుణులు ప్రణాళికలను వేశారు. రూ. 5.58కోట్లతో నిధులను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. దీంతో 1962 నుంచి పనులను ప్రారంభించారు. 1966 నాటికి ప్రాజెక్టు పనులు పూర్తిస్థాయిలో నిర్మాణం చేయడం జరిగింది. ప్రాజెక్టు మొత్తంగా 407 అడుగుల సామర్థ్యంతో 13 గేట్లను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహం చేరకుండా ఇరు వైపుల అడ్డుకట్లను వేశారు. ఈ నీటి ద్వారా 10వేల ఎకరాల సాగుకు 1 టీఎంసీ నీటిని సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు విద్యుత్ థర్మల్ కేంద్రం ఆధీనంలో నడుస్తోంది.

నీటి సరఫరా ఇలా..

కిన్నెరసాని జలాశయం విద్యుత్ ఉత్పత్తితోపాటు పది ఎకరాల సాగుభూమికి, ఈ ప్రాంత ప్రజల దాహార్తిని కూడా తీరుస్తోంది. విద్యుత్ ఉత్పత్తికి ఏడాదికి 2.20 టీఎంసీల నీరు సరఫరా చేస్తుండగ, నవభారత్ కర్మాగారానికి 0.126 టీఎంసీల నీరు, ఎన్ఎండీసీకి 0.03 టీఎంసీల నీరు, కొత్తగూడెం మునిసిపాలిటీ ప్రజలదాహార్తికి 0.473 టీఎంసీల నీరు, పాల్వంచ మునిసిపాలిటీకి 0.2టీఎంసీల నీరు, పది వేల ఎకరాలకు 1 టీఎంసీ నీరు సరఫరా జరుగుతోంది.



తొలి విద్యుత్ థర్మల్ కేంద్రం

ఈ ప్రాజెక్టు ఆధారంగా ఉమ్మడి రాష్ట్రంలో 1967లో విద్యుత్ థర్మల్ ప్రాజెక్టును ఇక్కడ (కేటీపీఎస్) నిర్మించారు. జపాన్ పరిజ్ఞానంతో హిటాచ్‌కంపెనీ నేతృత్వంలో ఏ,బీ,సీ స్టేషన్లను నిర్మించి 240మెగావాట్ల విద్యుదుత్పత్తిని తీశారు. ఆ తర్వాత 5వ దశలో 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 6వ దశలో 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 7వ దశలో 800మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే నీటిని ఈ ప్రాజెక్టు నుంచి వినియోగిస్తున్నారు. సంవత్సరానికి 2.20 టీఎంసీల నీటిని విద్యుదుత్పత్తి సామర్థ్యానికి వాడుతున్నారు. 407 అడుగుల నీటిని ప్రతియేటా ప్రాజెక్టులో నిల్వ చేయడం వల్ల విద్యుదుత్పత్తికి ఎటువంటి సమస్యలు తలెత్తడంలేదు. రాష్ట్రంలో విద్యుదుత్పత్తి చేసే కేంద్రంగా కేటీపీఎస్ పేరొందింది. అయితే గత సంవత్సరం కేంద్ర పర్యావరణశాఖ ఆదేశాల మేరకు 1967లో నిర్మించిన పాత ప్లాంట్‌ను నేలకూల్చారు. ఇప్పటికీ మరో 500మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవసరమయ్యే నీటి సామర్థ్యం కిన్నెరసాని జలాశయంలో పుష్కలంగా ఉంది.

వడ్డీ లేని రుణాల గురించి మీకు తెలుసా ?

ఇందిరాశక్తి మహిళలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాటామంతీ



డిప్యూటీ సీఎంతో మాట్లాడుతున్న ఐకేపీ మహిళ రాణి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డీలేని రుణాలు మీకు ఇస్తున్నారా ? మీకు తెలుసా అసలు.. ప్రభుత్వం మీరు తీసుకునే రుణాలకు వడ్డీ మొత్తాన్ని చెల్లిస్తుంది.. మీకు తెలుసా అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహిళలతో అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన ఐకేపీ మహిళలతో సంభాషించారు. ఈసందర్భంగా కూసుమంచి మండలం జుజ్జుల్ రావుపేటకు చెందిన రాణి, తమకు చెందిన భూమిలో రూ. 6 లక్షల రుణం తీసుకొని, చేపల, రొయ్యల చెరువు, పాడి, గొర్రెల పెంపకం, సేంద్రియ వరి, కూరగాయల సాగు, నాటు కోళ్ల పెంపకం తదితరాలు చేపట్టి నెలకు సుమారు రూ.2లక్షలు సంపాదిస్తున్నట్లు, మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించింది. దీనికి స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏమ్మా..! రాణీ... మీరెన్నేళ్లుగా వ్యాపారం చేస్తున్నారు..? - మీకు గతంలో బ్యాంకు ఎంత రుణాన్ని ఇచ్చింది... ? ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వడ్డీ లేని రుణాలను ఇస్తున్నారు కదా అందాయా మీకు అంటూ ప్రశ్నించారు.

దీనికి రాణి మాకు తెలియదు సార్ అని చెప్పగానే.. భట్టి విక్రమార్క ఎవరు ఐకేపీ ఏపీఎం అని పిలిచారు...! కూసుమంచి ఏపీవో సత్యవర్ధన్ రాజు వేదిక వద్దకు వచ్చారు. ఏపీఎం గారూ.. ! మన జిల్లాలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు రావడం లేదా అని ప్రశ్నించారు. రాణి వాళ్ల గ్రూపుకు ఎంత మేర బ్యాంకు రుణాన్ని ఇచ్చారు. వడ్డీ లేకుండా వచ్చిందా రాలేదా..? అని భట్టి ప్రశ్నించారు. దీనికి ఏపీఎం... వచ్చింది సార్ అది బ్యాంకులో జమ అయ్యాయి సర్ అని చెప్పారు. ఈ విషయాన్ని గ్రూపు మహిళలకు చెప్పారా...? అని ప్రశ్నించారు. చెప్పలేదు అని ఏపీఎం చెప్పడంతో ఒకింత అసహనాన్ని వ్యక్తం చేసిన భట్టి.. పీడీ గారు...? గతంలో మాదిరిగా చేయొద్దు... ? మీ వాళ్లకు చెప్పండి... ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తోంది.. వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తోంది. ఈ విషయాన్ని వాళ్లకి తెలియచేయాలి కదా.. గతంలో మాదిరిగా చేస్తే ఊరుకునేది లేదు... అంటూ హెచ్చరించారు.

డిప్యూటీ సీఎం చొరవతో.. మధిరకు ప్రభుత్వ ఐటీఐ కాలేజీ

- 5 కోర్సులు.. 200 సీట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రూ.11.37కోట్ల నిధులు



మధిర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలనే సంకల్పంతో అనేక ఉపాధి కల్పనా పథకాలను అమలుచేస్తుంది. ముఖ్యంగా వారిలోని స్కిల్స్‌ను అభివృద్ధి చేసి ఉపాధి మార్గాలను కల్పించేందుకు సాంకేతిక విద్యపై దృష్టిసారించి అవసరమైన నైపుణ్యశిక్షణతో విద్యాఅవకాశాలను కల్పిస్తుంది. అందులో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో మధిర నియోజకవర్గానికి ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలను మంజూరు చేసింది. ఈమేరకు శనివారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మధిర నియోజకవర్గానికి 5కోర్సులతో ఒకోక బ్రాంచ్‌కు 40 సీట్లు చొప్పున 200సీట్లుతో ఐటీఐ కళాశాల మంజూరు అయింది. ముఖ్యంగా యువతకు ఉపాధి లభించేలా ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ రెండు సంవత్సరాల కోర్సులు, అలాగే ఐవోటీ స్మార్ట్ అగ్రికల్చర్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికిల్ ఒక సంవత్సరం కోర్సులు ఉండనున్నాయి. అయితే కళాశాల ఎక్కడ ఏర్పాటు అనే విషయమై ఇంకా స్థలం నిర్ధారణ జరగలేదు. దీనిపై భట్టి విక్రమార్క ఆదేశాలు రావాల్సివుంది. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ ఈమేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. ఇందుకు ఉద్యోగుల పోస్టులను కూడా ప్రకటించారు. శాశ్వత ప్రాతిపదికన ఒక ప్రిన్సిపాల్, ఆయా బ్రాంచ్‌లలో విద్యాబోధనకు శిక్షణ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర 21మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను మంజూరిచేశారు. అంతేకాకుండా కళాశాల నిర్మాణానికి రూ.11.37 కోట్లు నిధులు ఖర్చుచేయనున్నట్లు తెలిపారు. దీనిలో రూ.10.31కోట్లు నిర్మాణానికి, శిక్షణ నిధి, ఇతర ఖర్చులకోసం మిగిలిన నిధులు ఖర్చుచేయడం జరుగుతుందని ఆ ఉత్తర్వులు పేర్కొన్నారు. దీంతో ఇంతవరకు మధిరలో ఒక ప్రైవేట్ ఐటీఐ కళాశాల ఉన్నా అది యువతకు ఏమేరకు ఉపయోగపడటంలేదు. కేవలం అలంకార ప్రాయంగానే మారిందని సరైన శిక్షణ ఇవ్వడం లేదనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంఆధ్వర్యంలో ఐటీఐ కళాశాల మంజూరు చేయడం పట్ల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు సాంకేతికవిద్య అందుబాటులోకి వచ్చి ఉపాధి దొరుకుతుందని ఆశాభావంవ్యక్తం చేస్తూ డిప్యూటీ సీఎంకు ప్రత్యేకించి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కుల గణన శిక్షణకు అధికారులు

- 589 గ్రామపంచాయతీల్లో జరుగనున్న గణన
- ప్రతీ ఎన్యుమరేటర్‌కు 150 ఇళ్లు

ఖమ్మం కలెక్టరేట్ , అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని నిర్ణయించిన కులగణన నవంబరు 4న ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కులగణన కోసం జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో నవంబరు 4 నుంచి ప్రారంభం కానున్న కులగణన కోసం ఎన్యుమరేటర్ల నియామకపు ప్రక్రియను చేపట్టనున్నారు. దీనిలో భాగంగా జిల్లా నుంచి ఇప్పటికే ఎనిమిది మందిని హైదరాబాద్‌లో శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు తెలిసింది. ముగ్గురు ఎంపీడీవోలు, ముగ్గురు ఎంపీవోలు, మరో ఇద్దరు ఏఎస్వోలను ఎంపిక చేశారు. వీరని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న శిక్షణకు వెళ్లనున్నారు. అక్కడ శిక్షణ పొందిన తర్వాత ఎన్యుమరేటర్లకు వీరు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లాలో 589 గ్రామపంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీల్లో ఇంటింటికీ తిరిగి కులగణన చేపట్టనున్నారు. ప్రతి ఎన్యుమరేటర్ 150 ఇళ్లలో సర్వే చేయనున్నారు. నవంబరు 19వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన ప్రశ్నావళిని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసినట్లు ఆ ప్రశ్నావళిని ప్రణాళికా శాఖ ద్వారా అందించనున్నట్లు సమాచారం. ఇది పూర్తయితే జిల్లాలో నవంబరు 4వ తేదీ నుంచి కులగణన ప్రారంభం కానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాఠశాలల అభ్యున్నతికి ఎంఈవోలకు ఒక్కరోజు శిక్షణ

- ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి హాజరుకానున్న 44మంది

కొత్తగూడెం అర్బన్, ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 27: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం దృష్టి సారించింది. నూతన ఉపాధ్యాయుల నియామకంతో పాటు విధులు కేటాయించింది. ఇటీవల ఒక్కో మండలానికి ఒక ఏంఈవోను నియమించి వారందరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ కార్యాచరణను రూపొందించింది. ఈనెల 29న హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 44 మండలాలకు 44మంది ఏంఈవోల ఈ శిక్షణకు హజరుకానున్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లానుంచి పాత ఏంఈవోలు ఎనిమిది మందితో పాటు కొత్తగా 15మంది పీజీహెచ్ఎంలకు ఇన్‌చార్జ్ ఏంఈవోలుగా అదనపు బాధ్యతలు కేటాయించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో మొత్తం 23మంది ఇన్‌చార్జ్ ఏంఈవోలు, ఖమ్మం జిల్లాలో 21మంది ఏంఈవోలు ఈ శిక్షణకు హాజరుకానున్నారు.

ఫిట్టర్ పోస్టుల భర్తీకి అంతర్గత రాత పరీక్ష

కొత్తగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఫిట్టర్ (ట్రైనీ)- పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయడానికి ఆదివారం సింగరేణి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. 123 ఖాళీలకు గాను అర్హులైన 62మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా 46మంది హాజరయ్యారు. ఈ రాత పరీక్ష సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో, సీసీ కెమెరాల నిఘా మధ్య నిర్వహించారు. సింగరేణి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జీఎం (పర్సనల్) వెల్ఫేర్‌అండ్‌ఆర్‌సీ పి. సామ్యూల్ సుధాకర్, జీఎం (ఈఅండ్‌ఎం) విజిలెన్స్ కె. ప్రసాద్‌రావు పర్యవేక్షించి పరీక్ష పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరు మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు రాత్రి నుంచే సింగరేణి వెబ్‌సైట్, సింగరేణి ప్రధాన కార్యాలయం ముఖద్వారం వద్ద నోటీసు బోర్డు ద్వారా తెలియజేస్తామని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో డీజీఎం (పర్సనల్) పి. వేణుగోపాల్‌రావు, పర్సనల్ మేనేజరు కే. ప్రకాశరావు, విజిలెన్స్ ఆఫీసర్లు షకీర్ మోహీనుద్దీన్, పివిఎస్. శాస్త్రీ, డీవైపీఎంలు డి. నాగేశ్వరరావు, కే. సంతోష్‌కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింత శారద, ఇతర అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోస్టల్ ఆర్డీల చెల్లింపులో తీవ్ర జాప్యం

మణుగూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మణుగూరు సబ్ పోస్టాఫీసులో పోస్టల్ రికరింగ్ డిపాజిట్ల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. మెచ్యూర్ అయిన ఆర్డీలను వెంటనే చెల్లించాల్సి ఉండగా 10 రోజులు ఆలస్యంగా సొమ్ములను చెల్లిస్తున్నారు. మణుగూరులో సింగరేణి కార్మికులు, వందల సంఖ్యలో పోస్టల్ ఆర్డీలను చేశారు. కనిష్ఠం రూ.100 నుంచి పరిమితి లేని గరిష్ఠం వరకు ఆర్డీలు చేసిన వారు ఉన్నారు. సొమ్ము చేతికి వచ్చే సమయంలో పోస్టల్ శాఖ చేస్తున్న జాప్యం వల్ల బ్యాంకులో సొమ్ము దాచిన బాగుండేది అనుకుంటున్నారు.

కాలపరిమితి అయిపోతున్న దశలో ఆర్డీలు చేసిన వ్యక్తి పోస్టాఫీసుకు వచ్చి ఆ వివరాలను పోస్టల్ శాఖ వారికి అందిస్తారు. అప్పుడు ఆ శాఖ వారు పలానా తేదీ నాటికి ఆ ఆర్డీ మెచ్యూర్ అని పూర్తి చేస్తారు. అయితే ఇవ్వాల్సిన సొమ్మును ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు. మెచ్యూర్ అయిన తర్వాత రోజుకి ఆర్డీ చేసిన సొమ్ము అందించాలి కానీ ఇది జరగడం లేదు. ఈ ప్రక్రియలో అంతా జాప్యం జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో 10 లేక 12 రోజులకు చెల్లిస్తున్నారు. ఆర్డీ చెల్లింపు ఆలస్యంపై ప్రశ్నిస్తే పోస్టాఫీసు సిబ్బందిలో ఒకరు దురుసుగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మణుగూరు పోస్టుమాస్టర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా అశోక్ నగర్‌లో ఉన్న పోస్టాఫీసును నాలుగేళ్ల కింద పైలెట్ కాలనీ రోడ్డుకు మార్చడం వల్ల రికార్డులు వెతుకులాటలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే అన్నారు. దాదాపు వారం రోజుల పాటు ఆలస్యం జరిగే మాట కూడా వాస్తమే అన్నారు. ఖాతాదారులతో నిర్లక్ష్యంగా ఆగ్రహంతో దురుసుగా ఖాతాదారుల ప్రవర్తన బట్టి మాట్లాడాల్సి వస్తోందన్నారు. జరిగే జాప్యాన్ని నివారించి సకాలంలో మెచ్యూరిటీ ఆర్డీలను చెల్లిస్తామన్నారు.

ప్రతి ఒక్కరూ ధర్మపరిరక్షణకు పాటుపడాలి

- కంచికామకోటిపీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతిస్వామి
- ముగిసిన తెలంగాణ వేదవిద్వన్మహాసభలు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ధర్మపరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతిస్వామి పిలుపునిచ్చారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపు రాయాలయంలో నిర్వహించిన తెలంగాణ 24వ వేదవిద్వన్మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై శంకర విజయేంద్ర సరస్వతిస్వామి భక్తులనుద్దేశించి మాట్లాడారు. హిందూ ధర్మం అత్యుత్తమమైనదని, హిందువులుగా పుట్టిన వారంతా ధర్మపరిరక్షణకు పాటుపడాలని కోరారు. ధర్మ పరిరక్షణ సేవా కార్యకర్తల అవసరం ప్రస్తుత సమాజానికి ఎంతో ఉందన్నారు. ధర్మ ప్రచారాల కోసం ప్రత్యేకంగా సేవా గ్రామాలను ఏపీలో శ్రీకారం చుట్టామని, తెలంగాణలో సైతం ధర్మ ప్రచార గ్రామాలను ఎంపిక చేయాలన్నారు. ధర్మ ప్రచారాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో సహాయ సహకారాలందిస్తోందన్నారు. స్థానిక ప్రజలు సైతం ధర్మాచరణకు కట్టుబడి ఉన్నారన్నారు. వేదం అభ్యసించటం ధర్మనిష్ఠకు సంకేతమని వేదధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందించే క్రతువుకు పూనుకోవటం అభినందనీయం అన్నారు. ఖమ్మంలో వేద విద్యార్థుల యోగ్యతా పరీక్షల నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి చెందినట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంచుకున్న రామాలయ ప్రాంగణం సైతం ఎంతో హృద్యంగా ఉందన్నారు.

ఘనంగా నగర శోభాయాత్ర..

వందలాది మంది వేద విద్యార్థులు, పండితులు, అర్చకులతో ఆదివారం నగర శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మంగళ శ్లోకాలను పఠిస్తూ స్థానిక రామాలయం నుంచి స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు యాత్ర నిర్వహించారు. సంప్రదాయ వేషధారణతో వందలాది మంది ప్రదర్శనలో పాల్గొనటంతో హిందూ ధర్మం నడిచివచ్చినట్లుగా అనిపించింది.

ఘనంగా ముగిసిన వేద మహాసభలు..

తెలంగాణ 24వ వేదవిద్వన్మహాసభలు ఆదివారం ఖమ్మంలో ఘనంగా ముగిశాయి. వేద మహాసభల సందర్భంగా జనార్ధనానంద సరస్వతిస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని గాయత్రి సేవాసమితి, స్తంభాద్రి పురోహిత సంక్షేమ సంఘం సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. తెలంగాణ ప్రాంతంలోని పలు జిల్లాల్లోని వేద పాఠశాలల్లో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సామర్థ్య పరీక్షలను నిర్వహించారు. ఏటా ఏదో ఒక జిల్లాలో ఈతరహా పరీక్షలను నిర్వహిస్తుండగా ఈ దఫా ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపు రామాలయం వేదికైంది. వేద మహాసభల ముగింపు సందర్భంగా ధర్మపురి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి చేతుల మీదుగా వేద పండితులను ఘనంగా సత్కరించారు. వేద విద్యార్థుల యోగ్యత పరీక్షల నిర్వహణ, హోమాల నిర్వహణ తదితర వేద మహాసభల క్రతువులో పాలు పంచుకున్న పండితులను సంప్రదాయబద్ధంగా సత్కరించారు.

యోగ్యతా పత్రాల అందజేత

రాష్ట్ర వ్యాప్తంగా పలు వేద పాఠశాలల్లో వేదవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నిర్వహించిన యోగ్యతా పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి యోగ్యతా పత్రాలను సచ్చిదానంద సరస్వతిస్వామి చేతుల మీదుగా అందజేశారు. మూల, క్రమాంత, ఘనాంత విభాగాలలో పరీక్షలు నిర్వహించగా యోగ్యత సాధించిన విద్యార్థులకు జయపత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో పసుమర్తి బ్రహ్మానంద శర్మ, సోమరాజు రామ కిషన్ రావు, కోదండ రామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కేంద్రంపై పట్టింపేదీ?

అశ్వారావుపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలం, కన్నాయిగూడెం, ఏపీలోని దొరమామిడి మధ్యలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గుబ్బలమంగమ్మ ఆలయం ఉంది. ఏపీలోని జంగారెడ్డిగూడెం నుంచి సుమారు 40 కిమీ. దూరం, తెలంగాణాలోని అశ్వారావుపేటలో నుంచి 45 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవి, కొండలు, జలపాతాల మధ్య అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయానికి వెళ్లే రహదారి వెంట ఉండే అడవులను చూస్తూ వెళుతుంటేనే భక్తులు ఎనలేని అనుభూతికి లోనవుతారు. ఆలయం సమీపిస్తుండగానే పలు వాగులు దాటుకుంటూ, భారీ వృక్షాలు, కొండల మధ్యలో ప్రయాణం నిజంగా అత్యద్భుతంగా ఉంటుంది. గుబ్బలమంగమ్మ ఆలయం పైనుంచి నిత్యం జలపాతం జాలువారుతూనే ఉంటుంది. అందుకే అమ్మవారిని దర్శనం చేసుకోవాలంటే నడుములోతు నీళ్లలో నుంచి గుహమార్గంలో ఆలయం లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. రాతి గుహలో అమ్మవారు గుబ్బలు గుబ్బలుగా భక్తులకు దర్శనమిస్తారు. అందుకనే అమ్మవారిని గుబ్బలమంగమ్మగా పిలుస్తుంటారు. ఈ ఆలయానికి వచ్చే భక్తులు అధికశాతం కోళ్లు, యాటలను అమ్మవారికి సమర్పించి, సాయంత్రం వరకు అక్కడే గడుపుతారు. అందుకే ఆధ్యాత్మికంతోపాటు ఆహ్లాదరకమైన టూరిస్టు ప్రదేశంగా ఈ ప్రాంతాన్ని పరిగణిస్తారు.

హామీలకే పరిమితమైన టూరిజం అభివృద్ధి..

గుబ్బలమంగమ్మ ఆలయాన్ని టూరిస్టు ప్రదేశంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వాలు అనేకమార్లు హామీలు ఇచ్చాయి. 15 ఏళ్ల క్రితం ఐటీడీఏ, అటవీశాఖ ఆధ్వర్యంలో అక్కడ కొన్ని షెడ్లు నిర్మించారు. ఆ తరువాత వాటి మెయింటెనెన్స్‌ను మరిచారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు టూరిజం మంత్రిగా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌లుగా కూడా పనిచేశారు. వారి హయాంలోనైనా గుబ్బలమంగమ్మ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని భావించినా ఈ ప్రాంత వాసులకు నిరాశేమిగిలింది. ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

యాచకుడికి ఐపీ నోటీస్

(5వ పేజీ తరువాయి)

చదువుతున్నారు. కుమార్తె ఓణీల కార్యక్రమం సందర్భంగా ఆలయ నిర్వాహకులు విరాళంగా ఇచ్చిన డబ్బుతో పాటు తాము బిక్షాటన చేసి దాచిన డబ్బు కలిపి మొత్తం రూ.50వేల నగదు తమ వద్ద ఉంచుకున్నాడు. అయితే యాచకుడు అశోక్ రోజూ స్థానికంగా ఉన్న ఓ హోటల్ వద్దకు టిఫిన్ కోసం వెళుతుంటాడు. అంతే కాకుండా ఆ హోట్ యజమాని నర్సింహారావు రోజూ దేవాలయానికి వస్తుంటాడు. దాంతో సదరు హోటల్ యజమానితో అశోక్‌కు పరిచయం ఏర్పడింది. ఈ క్రమలో హోటల్ యజమాని నర్సింహారావు తన అవసరాల కోసం యాచకుడు అశోక్ వద్ద కొద్దిపాటి డబ్బును తీసుకొని తిరిగి ఇస్తుండేవాడు. కొద్ది రోజుల తరువాత తనకు అత్యవసరంగా రూ.50వేలు కావాలని, ఏడాది కాలంలో వడ్డీతో కలిపి ఇస్తానని నర్సింహారావు యాచకుడిని కోరడంతో అతడు డబ్బు ఇచ్చాడు. ఈ సందర్భంగా అతడు యాచకుడికి ప్రాంసరీ నోటు కూడా రాసి ఇచ్చాడు. అయితే సదరు వ్యాపారి నర్సిహారావు వ్యాపారంలో నష్టాలపాలై రూ.2కోట్ల 75లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. అందులో భాగంగా యాచకుడు అశోక్‌కు కూడా ఐపీ నోటీస్ రావడంతో ఇక తనకు డబ్బులు వచ్చే పరిస్థితి లేదని తన కుమార్తె భవిష్యత్ ఏంటని యాచకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

కమ్యూనిస్టులంతా ఏకం కావాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

తిరుమలాయపాలెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాద బీజేపీ ప్రభుత్వం రాజ్యం ఏలుతున్న వేళ కష్టజీవుల మనుగడకోసం మతోన్మాద బీజేపీకి సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలంటే కమ్యూనిస్టులంతా ఏకమయ్యే ఆసన్నమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో ఆదివారం పప్పుల భద్రయ్య నగర్‌లో దోనేపల్లి వెంకన్న ప్రాంగణంలో సీపీఎం 9వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అమరవీరులకు నివాళులర్పించారు. పార్టీ జెండాను నాయకులు తాత వెంకటకృష్ణయ్య ఆవిష్కరించారు. అనంతరం అంగిరేకుల నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కులాలు, ప్రాంతాల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. కార్పొరేట్ శక్తులకు గుణపాఠం చెప్పాలంటే కమ్యూనిస్టులంతా ఐక్యం కావాల్సి ఉందన్నారు. బీజేపీ పాలనలో దళితులు, గిరిజనులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. పరిశ్రమల పేరుతో రైతులు సాగుచేసుకుంటున్న సారవంతమైన భూములను బలవంతంగా లాక్కుంటూ బడాపారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పాలక ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి నెరవేర్చలేని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపామని, కానీ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే మాత్రం పోరాడేది ఎర్రజెండా పార్టీనే అన్నారు. జిల్లాలో దీర్ఘకాలంగా ఉన్న ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టి పరిష్కరించామన్నారు. ఆనాడు సాగు, తాగునీటి ప్రాజెక్టుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడితేనే నేడు ప్రాజెక్టులు కడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, ఎర్ర శ్రీనివాస్, బషీరుద్దీన్, చల్లా వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, నాగటి సురేష్, పద్మనాభుల సుధాకర్, దొడ్డ లింగస్వామి, దొండేటి ఆనందరావు, పాల్గొన్నారు. సీపీఎం పార్టీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శిగా కొమ్ము శ్రీను రెండోసారి ఎన్నికయ్యారు. 23మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భగా కొమ్ము శ్రీను మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిని రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి కృతజ్ఞతలు తెలిపారు.



సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను

అధికారులే పనులు అప్పగిస్తున్నారు..

- గ్రామ పంచాయతీల్లో నామినేటెడ్ పనుల్లో బీఆర్ఎస్ నేత
- బోనకల్ నుంచి వచ్చి రఘునాథపాలెంలో రూ.లక్షల పనులు
- బిల్లులు రావంటూ కాంగ్రెస్ నాయకులకు అధికారుల బుజ్జగింపు
- అధికారుల కమీషన్ల మతలబే అంటూ విమర్శలు

రఘునాథపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రానున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నాయకులను ప్రోత్సహించేందుకు, గ్రామాల్లో ఆ నాయకులకు గుర్తింపు పెంచేందుకు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నామినేటెడ్ అభివృద్ధి పనులను కేటాయింపు జరుగుతుంది. ఎటువంటి టెండర్ విధానం లేకుండా అధికారుల పర్యవేక్షణలో నిర్ణీత పరిధి మేరకు అభివృద్ధి నిధులు కేటాయింపు జరుగుతుంది. వీటిలో ఎంతో కీలకమైనవి ఎన్ఆర్ఈజీఎస్ పనులు.

గత ప్రభుత్వంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టిన వారికి బిల్లులు రావటంలో జాప్యం జరిగింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం పెండింగ్ బిల్లులను దశల వారీగా మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో 2024 మార్చి వరకు రఘునాథపాలెం మండలంలో చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. అయితే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రఘునాథపాలెం మండలానికి భారీగా నిధులు మంజూరు చేయిస్తున్నారు. తొలి విడతలో ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు కేటాయించారు. స్థానిక నాయకులతో శంకుస్థాపనలు చేయించారు. ఇప్పుడు రెండో విడతగా ఒక్కో గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన, స్థానిక అవసరాలకు తగిన విధంగా ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20లక్షల నుంచి రూ.70లక్షల వరకు నిధులు మంజూరు చేయించి స్వయంగా శంకుస్థాపనలు చేస్తున్నారు.

అధికారులే నామినేట్ చేస్తున్నారు..

గ్రామ పంచాయతీల్లో చేపట్టే నామినేటెడ్ అభివృద్ధి పనులను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. కానీ రఘునాథపాలెం మండలంలో పనులు మాత్రం బోనకల్ మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ, ప్రముఖ కాంట్రాక్టర్ చేపడుతున్నారని బహిరంగచర్చ జరుగుతుంది. శంకుస్థాపనల కార్యక్రమాల్లో అధికారులతో పాటుగా బీఆర్ఎస్ నాయకులు పాల్గొనటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. శంకుస్థాపనలు జరిగిన తర్వాత స్థానిక నాయకులకు అధికారులు బుజ్జగింపులు చేసి బీఆర్ఎస్ నాయకునికి పనులు అప్పగిస్తున్నారని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో చేసిన బిల్లులే ఇప్పటికి రాలేదని బిల్లులు జాప్యం జరుగుతాయని ఇంజనీరింగ్ అధికారులే చెప్పటంతో నామినేటెడ్ పనులు చేపట్టేందుకు నాయకులు ముందుకు రాకపోవటంతో కాంట్రాక్టర్‌కు పరోక్షంగా లైన్ క్లియర్ అవుతుందని మండల వ్యాప్తంగా చర్చ జరుగుతుంది.

క్వాలిటీ పనులు చేస్తాడని అప్పగిస్తున్నాం మహేశ్, డీఈ, పంచాయతీరాజ్

బిల్లులు రావటం జాప్యం జరుగుతుందని, నామినేటెడ్ పనులు చేసేందుకు స్థానిక నాయకులు ముందుకు రావటం లేదు. బోనకల్ కాంట్రాక్టర్ రఘునాథపాలెంలో పనులు చేసే విషయం వాస్తవమే. అతని వద్ద పనులు చేసేందుకు కావాల్సిన మిషన్లు ఉన్నాయి. క్వాలిటీ పనులు చేస్తాడని పనులు ఇస్తున్నాం. కమిషన్ల కోసం కాదు. నేను మంచిగా పనిచేస్తానని మహబూబాబాద్‌లో పనిచేస్తున్న నన్ను ఇక్కడకు మంత్రులు తీసుకొచ్చారు.

బినామీ పేర్లతో దరఖాస్తులు

- 122 మందికే బాణాసంచా దుకాణాల కేటాయింపు
- మొత్తం దరఖాస్తులు 132
- షాపులు రానివారు లబోదిబో

ఖమ్మంక్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో బాణాసంచా దుకాణాల ఏర్పాటులో బినామీల దందా కొనసాగుతోంది. కొంతమంది బినామీ పేర్లతో బాణాసంచా దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని వేరే వారికి కేటాయించేందుకు వీలులేకుండా ఉండేందుకు కొంతమంది షాపుల యజమానులు కలిసి చేస్తున్న దందా ఇది. అడిగేవారు లేకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మొత్తం 132 దరఖాస్తులురావడంతో వాటిని డ్రా పద్ధతిలో ఆదివారం పోలీసులు 122మందికి షాపులు కేటాయించారు. వీటిల్లో ఆరుగురికి షాపులు దక్కకపోవడంతో వారు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈఏడాది కూడా బాణాసంచా దుకాణాలకు కొంతమంది దందా చేస్తున్నారు. వచ్చిన దరఖాస్తుల ప్రకారం షాపులు కేటాయిస్తామని అధికారులు తెలపడంతో వారు ఒక్కొక్కరు రెండు, మూడు షాపులు చొప్పున దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఉన్నారు. షాపులు దక్కని వారు ఆంధ్రాలోని బాణాసంచా తయారీ కంపెనీలకు లక్షలాది రూపాయలు సరుకుకోసం అడ్వాన్సులు చెల్లించి ఇప్పుడు షాపులు దక్కకపోవడంతో లబోదిబోమంటున్నారు.

ఖాళీ షాపులకు యమ డిమాండ్..

బాణాసంచా దుకాణాలు నిర్వహించుకునేందుకు నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో పోలీసులు, సంబంధిత అధికారులు షెడ్లతో ఏర్పాట్లు చేశారు. దీంతో షాపులకు దరఖాస్తు చేసుకోవాలని ఇటీవలే పోలీసులు ప్రకటన చేయడంతో పలువురు షాపుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 132మంది దరఖాస్తు చేయగా వీటిలో 4 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించారు. 122మంది మాత్రమే షాపులు దక్కించుకున్నారు. వీటిల్లో కొంతమంది కావాలని ఒకొక్కరు రెండు, మూడు షాపులకు దరఖాస్తులు చేసుకోవడంతో షాపులు దక్కని వారు రెండు, మూడు షాపులు దరఖాస్తులు చేసిన వారిని ఆశ్రయించారు. దీంతో వారి వద్ద సుమారు రూ.లక్ష సరుకు గతేడాది ఇంకా ఉందని, దానిని తీసుకుని దరఖాస్తు చేసుకున్న డబ్బులకంటే డబుల్ డబ్బులు చెల్లిస్తేనే ఇస్తామని షాపు యజమానులు తేల్చిచెప్పారు. దీంతో సరుకు కోసం అడ్వాన్సు కట్టిన డబ్బులు తిరిగిరావని చేసేదిలేక షాపు యజమానులను బతిమిలాడే పనిలో షాపులు దక్కని వారు ఉన్నారు. ఈవిషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు చేసేదేమిలేదన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

డ్రాలో 122మంది కేటాయింపు

టపాసుల షాపుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం నగరంలోని పోలీసు కాన్ఫరెన్సు హాల్ నందు అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్, టౌన్ ఏసీపీ రమణమూర్తి, టూటౌన్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల చేతుల మీదుగా డ్రా నిర్వహించారు. ఈడ్రాలో షాపులు దక్కిన వారికి ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో నెంబర్ల వారీగా షాపులు కేటాయించారు. 122మంది షాపులు కేటాయించడంతో వారు షాపుల్లో ఏర్పాటుచేసుకునేందుకు నిమగ్నమయ్యారు. అదేవిధంగా ఫైర్‌సేఫ్టీ అధికారులు కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఫైర్ క్యాన్లు, నీళ్ల డ్రమ్ములు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

షాపులు దక్కనివారికి మరోచోట కేటాయించే ఆలోచన?

దరఖాస్తు చేసుకుని షాపులు దక్కని ఆరుగురికి మరోచోట ఎక్కడైనా షాపులు కేటాయించాలా అన్న ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది. అందుకు సంబంధిత అధికారులు దరఖాస్తు చేసుకున్న వారితో కూడా మాట్లాడినట్లు సమాచారం. అందుకు పోలీసు అధికారులుసైతం మరోచోట ఎక్కడైనా కేటాయిస్తే వారికి ఏవిధంగా సహకరించాలన్నదానిపై చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

'లచ్చగూడెం' ఘటనలో లైన్‌మ్యాన్ సస్పెన్షన్

- ఏఈపై చర్యలు
- జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సురేందర్

ఖమ్మం సంక్షేమవిభాగం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో గ్రామానికి చెందిన జీ ప్రసాద్ మృతి చెందటంతో అందుకు బాధ్యులైన జూనియర్ లైన్‌మ్యాన్‌ను సస్పెన్షన్ చేసి ఏఈపై చర్యలు తీసుకున్నామని ఖమ్మం జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సురేందర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విధులు పట్ల విద్యుత్ సిబ్బంది అజాగ్రత్తగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఎటువంటి విద్యుత్ ఇబ్బందులు కలిగిన టోల్ ఫ్రీ నెంబర్ 1912 లేదా 18004250028 నెంబర్లకు కాల్ చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన తర్వాత సమస్య పరిష్కారం జరుగుతుందని తెలిపారు.

విద్యుత్ ఉపకరణాలు వాడకంపై అవగాహన, నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యుత్ వైర్లు, పరికరాలు వినియోగించటం ద్వారా విద్యుత్ ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సురేందర్ తెలిపారు.

రైతులు, గృహ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. రైతుల విద్యుత్ సమస్యలు పరిష్కారం కోసం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం రూపొందించామన్నారు. మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. లూజుగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయటం ఇతర సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. వంగిన విద్యుత్ పోల్స్‌ను సరి చేస్తున్నామని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) ట్రాక్‌పై ఓ వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నట్లు ఆనవాళ్ళు ఉన్నాయని జీఆర్‌పీ ఎస్ఐ జె.సురేష్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు జీఎల్-2 టవర్ కార్ షెడ్ పక్కన ఉన్న రైల్వే ట్రాక్‌పై పడి ఉండడాన్ని గుర్తించారు. మృతుడి ఎడమ చేయిపై(4-4-24 ఐమిస్‌యు అమ్మ) అని పచ్చ బొట్టు యున్నదని జీఆర్‌పి పోలీసులు గుర్తించారు. ఒంటిపై బ్లాక్ కలర్ ఫుల్ షర్ట్, బ్లాక్ కలర్ షాట్, గోధుమ రంగు ప్యాంటు, నడుముపై పంచరంగుల మొలతాడు ఉంది. మృతుడి వయస్సు సుమారు 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల ఉంటుందని తెలిపారు. ఈ సంఘటనపై డిప్యూటీ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహంను కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీకి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలిస్తే 9989025481, 8712658600, 9494790619, 9701371472 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు



అశ్వాపురం/ఖమ్మం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లెలమడుగు జడ్పీ హైస్కూల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సోయం సందీప్(23), తన బంధువు, కుక్కునూరు మండలం అమరారం గ్రామానికి చెందిన కారం సాయి కిరణ్‌తో కలిసి మొండికుంట గ్రామం నుంచి సారపాక వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో నెల్లిపాక నుంచి మొండికుంట వస్తున్న బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనటంతో సందీప్ అక్కడికక్కడే మృతిచెందగా, నెల్లిపాక గ్రామానికి చెందిన వేణు,మేఘనాథ్‌లు తీవ్రగాయాలపాలయ్యారు.అశ్వాపురం ఎస్ఐ తిరుపతిరావు క్షతగాత్రులను వెంటనే తన వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి మానవత్వంచాటుకున్నారు.

డివైడర్‌ను ఢీ కొని వ్యక్తి ..

ఖమ్మం రూరల్ (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఓ ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పొన్నేకల్లు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన అరికట్ల వీరబాబు (36) ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి ఆరెంపుల వెళ్తుండగా మార్గమధ్యలో పొన్నేకల్లు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొంది. తీవ్ర గాయాలపాలైన వీరబాబును స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వీరబాబుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రాజు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెబ్బవరంలో బస్‌షెల్టర్ కూల్చివేత

వైరా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం గ్రామంలో కొండకొడిమ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నేలమట్టానికి కూల్చివేశారు. కబ్జాదారులే ఈ బస్‌షెల్టర్‌ను కూల్చివేశారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆర్టీసీ వైరా స్టేషన్ సిబ్బంది బస్‌షెల్టర్ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నెమలికి చెందిన ఒకరు రెండున్నర దశాబ్దాల కిందట నెమలిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి వచ్చి వెళ్లే భక్తులు కొండకొడిమ, ఖానాపురం, గన్నవరం ప్రజల సౌకర్యార్థం ఈ బస్‌షెల్టర్‌ను నిర్మించారు. అయితే గత పదేళ్ల నుంచి బస్‌షెల్టర్‌ను ఆక్రమించి కొంతమంది వ్యాపారాలు నిర్వమిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా బస్‌షెల్టర్‌నే పూర్తిగా కూల్చివేశారు. దీన్ని కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



కూల్చిన బస్ సెల్టర్ శిథిలాలు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 8 మంది అరెస్ట్
- రూ. 8 వేల నగదు స్వాధీనం

పినపాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడూళ్లబయ్యారం పంచాయతీ పరిధిలోని రాయిగూడెం, పోతురెడ్డిపల్లి గ్రామ శివారుల్లో పేకాట నిర్వహిసున్నారన్న విశ్వసనీయ సమాచారంతో, ఏడూళ్ళబయ్యారం సీఐ వి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్‌కుమార్ సిబ్బందితో ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 మంది వ్యక్తులు పట్టుబడ్డారని, రూ 8 వేల నగదు, స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో పేకాట, కోడి పందాలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈజీ మనీ, జల్సాలకు బానిసలై యువత భవిష్యత్తును పాడుచేసుకోవద్దని ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు.

జాతి నిర్మాణంలో యువత పాత్ర

అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య

దుమ్ముగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతి నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. గంగోలులో ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన సదస్సుకు హాజరై మాట్లాడారు. యువత రాజకీయాల్లో చైతన్యవంతమైన పాత్రను పోషించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో బీఆర్ఎస్, సీపీఐ నాయకుల పేర్లను చేర్చడంతో మండల కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తి నెలకొందని పలువురు స్థానిక నాయకులు పొదెం దృష్టికి తీసుకొచ్చారు. నల్లపు దుర్గాప్రసాద్, చింతిర్యాల రవికుమార్, చందా సంతోష్, అప్పలరెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న పశువుల పట్టివేత!

స్టేషన్‌కు తరలించిన పోలీసులు

దుమ్ముగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో తరలి వెళ్తున్న పశువుల్ని ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొందరు వ్యక్తులు మండలంలోని భీమవరం పరిసరాల్లో కొనుగోలు చేసిన 34 పశువుల్ని అశ్వాపురం మండలం చింతిర్యాలకు తరలిస్తున్నారు. వీటిని కబేళాకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో గంగోలు వద్ద పోలీసులు వాటిని అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్ఐ గణేష్‌ను వివరణ కోరగా, పశువుల్ని పట్టుకున్న విషయం వాస్తవమేనని విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జట్లను ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. అండర్- 14, 17 బాల, బాలికల నెట్‌బాల్ జట్లతో పాటు అండర్-19 బాలుర, బాలికల బాస్కెట్‌బాల్, కరాటే జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరైనారు. ఎంపికల్లో ప్రతిభ చూపి క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు అండర్-17, 19 ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీలు నర్సింహమూర్తి, మూసా తెలిపారు. నెట్‌బాల్, బాస్కెట్‌బాల్ ఎంపికలను పివి. రమణ, కరాటే ఎంపికలను పలువురు కరాటే మాస్టర్లు సమీక్షించారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

ఖమ్మం చర్చికాంపౌండ్ అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామి ఇచ్చిన విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల స్థలం, అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేలు పించన్ ఇస్తామని హామి ఇచ్చారన్నారు. ఆరుగ్యారంటీల పథకంలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఉమ్మడి ఖమ్మంజిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, పగడాల నరేందర్, బచ్చల పద్మాచారి, రాచమల్ల ఉమాయాదవ్, లింగనబోయిన సతీష్, రెడ్డిబోయిన వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండవ ఆలయంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే పూజలు

చింతకాని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలోని శ్రీ నామాల వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దర్శించుకున్నారు. ఆయన వెంట చిన్నమండవ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి

ద్విచక్ర వాహ నాలు, నగదు స్వాదీనం

దమ్మపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసిన ఘటన అల్లిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపల్లి గ్రామ సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం రావటంతో దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసారు. ఈఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా కొందరు పరారయ్యారు. వీరి నుంచి రెండు కోడిపుంజులు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రు.2030లు నగదును పోలీ సులు స్వాదీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికి షోర్‌రెడ్డి తెలిపారు.

కథా రచయితలకు సమాజ పరిశీలన ఉండాలి

తెలంగాణ సాహితి రాష్ట్ర కన్వీనర్ ఆనందచారి



మాట్లాడుతున్న ఆనందాచారి

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కథా రచయితలకు సమాజ పరిశీలన ఉండాలని తెలంగాణ సాహితి రాష్ట్ర కన్వీనర్ కటుకోజ్వల ఆనందచారి అన్నారు. అక్షరాల తోవ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సర్వజ్ఞస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఖమ్మంకథా రచయితల ముఖాముఖికార్యక్రమం 'నా కథా ప్రస్థానం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కథా వస్తువులు సమాజంలో కోకొల్లలుగా ఉంటాయన్నారు. సమాజాన్ని పరిశీలించే శక్తి ఉంటే అనేక వస్తువులు లభిస్తాయన్నారు. ప్రపంచ సాహిత్యంలో ఎంతటి కథావస్తువు అచ్చయ్యిందో అంతకు అనేక రెట్లుగా సమాజంలో కథలు ఉన్నాయన్నారు. మరుగున పడిన, వెలుగు నోచని కథలను, గాథలను వెలికి తీయటం సృజనకారుల బాధ్యతఅన్నారు. బాధితులకు అండగా నిలిచే, కన్నీళ్లు తుడిచే, సమస్యల పరిష్కార మార్గం చూపే, పోరాట చైతన్యం రగిల్చే రచనలు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. సాహిత్య కృషిలో భాగంగా అక్షరాల తోవ సంస్థ కథా రచయితల పరిచయ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయం అన్నారు. ఖమ్మం కవిత్వ గుమ్మమే కాదు కథల కార్ఖానాకూడా అని చెప్పారు. వర్తమాన కాలంలో అనేక మంది కథా రచయితలు ఉద్భవించటం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గజల్ గాయకుడు, కవి కన్నెగంటి వెంకటయ్య జీవితం నుంచి ఉద్భవించే కథలు ఎక్కువ కాలం ఆదరణకలిగి ఉంటాయన్నారు. తన వ్యక్తిగతజీవితంలో ఆటుపోట్లు, అవమానాలను కథగా మలిచానని చెప్పారు. కార్యక్రమంలో కథారచయతలు దేవయ్య, షఫీ, కృష్ణయ్య, అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్, దాసరోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం, రైతు సంక్షేమానికి కృషి చేస్తా

రాష్ట్ర అగ్రికల్చర్, ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి



ఎమ్మెల్యే కోరం కనకయ్య, గోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయనికి, రైతు కుటంబ సంక్షేమానికి నిరంతరం వారి తోడ్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర అగ్రికల్చర్, ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా రావడంతో కొత్తలింగాల శ్రీకోటమైసమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లి కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో దివంగత నేత రాంరెడ్డి వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడ గోపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరం కనకయ్య, పార్టీ నాయకులు సన్మానించారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టిలు, ఎంపీ బలరాం నాయక్‌ఈ బాధ్యతలను అప్పగించారని అన్నారు. రైతు కష్టం నా కష్టంగా భావించి వారికి అన్ని వేళల అందుబాటులో ఉంటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి చరణ్‌రెడ్డి, గింజల నర్సింహరెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, మేకల మల్లిబాబు, డీఎస్, ధనియాకుల హన్మంతరావు, జీ.రాంబాబు, లక్ష్మణ్, సరిరాం, చల్లా మల్లయ్య, పాల్గొన్నారు.

యల్లంపల్లి వరలక్ష్మికి మంత్రి తుమ్మల నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం,అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకులు యల్లంపల్లి హనుమంతరావు మాతృమూర్తి యల్లంపల్లి వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె సంస్మరణ సభను ఆదివారం ఖమ్మంనగరంలోని 4వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై వరలక్ష్మీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. హనుమంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఐదో డివిజన్ కార్పొరేటర్ పల్లెబోయిన భారతిచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి తుమ్మల పర్యటన

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.30గంటలకు సత్తుపల్లిలో తర్వాత ఖమ్మంనగరంలోని 7వ డివిజన్ ఏకలవ్య నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

'ఐలు' మహిళలకు అండగా ఉండాలి

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ
- ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ సదస్సు



సెమినార్‌లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు

ఖమ్మం లీగల్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర తృతీయ మహిళా కన్వెన్షన్ సందర్భంగా ఆదివారం ఖమ్మం నగరంలోని సప్తపది ఫంక్షన్‌హాల్లో 'రాజ్యాంగ పరిరక్షణలో మహిళల పాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పి.సుధ ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఆమె ప్రసంగిస్తూ సమాజంలో సగభాగంగా వున్న మహిళలు అన్నిరంగాలలో రాణిస్తున్నారని అదే విధంగా మహిళలు న్యాయవాదులు గా రాణించాలని, ప్రజల హక్కులను ప్రధానం గా అణగదొక్కబడుతున్న మహిళలకు అండగా నిలబడాలని కోరారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ ప్రసంగిస్తూ రాజ్యాంగంలో మహిళలకు వున్న హక్కులు, రక్షణ గురించి ప్రసంగించారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఐలు న్యాయవాదుల పక్షాన నిత్యం పనిచేస్తున్నదని, మహిళా న్యాయవాదుల కోర్టులో ఎదుర్కొంటున్న సమస్యలను మహిళా న్యాయాధికారి దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. సెమినార్‌కు ఐలు మహిళా కన్వీనర్ చండాల శైలజ అధ్యక్షత వహించారు. రెండోరోజు ఆదివారం జరిగిన మహాసభలో రాష్ట్రంలో మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధులు చర్చించారు. ఈ సెమినార్‌లో కొత్త కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చండాల శైలజ, కో కన్వీనర్లుగా మోతుకూరి వనజ, ఎల్లావుల మంజులత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రిసెప్షన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నల్లమల నవీన్ చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు, ఐలు నేషనల్ కౌన్సిల్ మెంబర్స్ బోడేపూడి చంద్రశేఖర ఆజాద్, ఏడునూతన శ్రీనివాసరావు, ఐలు రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, ఐలు సీనియర్ నాయకులు జక్కంపూడి నాగేశ్వరరావు, వంజాకుల లక్ష్మినారాయణ, తన్నీరు పాపయ్య, వై.నాగేశ్వరరావు, ఐలు మహిళా నాయకురాళ్ల మోతుకూరి వనజ, పి.రామలక్ష్మి, శ్రీలక్ష్మి, ఐలు ఖమ్మం పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పబ్బతి రామబ్రహ్మం, పి.కిషోర్‌బాబు, బిల్లా శ్రీనివాస్, గద్దల దిలీప్, బిల్లా క్రాంతికుమార్, మాచర్ల నర్సింహారావు, టెంకటి వెంకటేశ్వర్లు, ఖమ్మం బార్ ఉపాధ్యక్షుడు కె.ఉపేంద్రరెడ్డి, జాయింట్ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క డీఏ విచారకరం

ఖమ్మంఖానాపురంహవేలిఅక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): ఐదు వాయిదాల కరువు భత్యం (డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం ఒక్క డీఏ ఇస్తున్నట్లు ప్రకటించటం విచారకరమని యూటీఎఫ్ జిల్లా కమిటీ ఖండించింది. కనీసం రెండు డీఏలైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బఫర్‌జోన్ పేరుతో అరకొర సౌకర్యాలు

- నాలుగో డివిజన్‌లో మౌలిక వసతుల కరువు
- డివిజన్ పరిధిలో అధికంగా ఇళ్ల పట్టా, రోడ్లు డ్రైనేజీ సమస్యలు
- బఫర్‌జోన్ ఉండటంతో అరకొరగా నిర్మాణాలు
- నాలుగో డివిజన్ ప్రజల ఇక్కట్లు



డివిజన్ విజిట్


రాజీవ్‌నగర్ గుట్టలో మట్టి రోడ్లు


మంచికంటి నగర్‌లో మట్టిరోడ్డు

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని నాలుగో డివిజన్‌లో కనీస అవసరాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, సీసీరోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు పూర్తిస్థాయిలో లేకపోవటంతో నరక యాతన అనుభవిస్తున్నారు. డివిజన్ పరిధిలో ఉన్న అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో సందడిగా ఉంటూ ఎల్లప్పుడూ ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. ఈ ప్రాంతంలో కార్పోరేషన్ అధికారులు సుమారు 70 ఎకరాల వరకు భఫర్‌జోన్‌గా ప్రకటించారు. ఫలితంగా ఇళ్లనిర్మాణాలు అరకొరగానే ఉన్నాయి. గ్రానైట్ పరిశ్రమలతో పాటు కొత్తగా ఏర్పడుతున్న వివిధ కాలనీల్లో ఇళ్ల పన్నులు అధికంగా వస్తున్నా అభివృద్ధిలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా వెనుకబాటు తప్పటంలేదు.

ప్రధాన సమస్యలు

ఇల్లెందు ప్రధాన రహదారి నుంచి అభయ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్ల వెడల్పు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. డివిజన్ పరిధిలో సుమారు 50 వరకు గ్రానైట్ పరిశ్రమలు పన్నులు కడుతున్నప్పటికీ తాగునీరు. రోడ్లు, వీధి దీపాలులేక రాత్రి పూట వచ్చి వెళ్లే కార్మికులకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు ప్రమాదాలు సంభవించాయి. డివిజన్‌కు శ్మశాన వాటిక, బస్తీదవాఖాన మంజూరైనా నిధులులేక ప్రారంభించలేదు.డివిజన్ పరిధిలోని విద్యానగర్, పాండురంగాపురం, అమరావతినగర్, మంచికంటి నగర్, వేణుగోపాల్‌నగర్‌లో కనీస అవసరలైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా లేకపోవటంతో ఇళ్లలో వాడుకున్న నీరు, వర్షపునీరు రోడ్లపై ఆగి దోమలు విపరీతంగా చేరి ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. రోడ్లపై నడిచివెళ్లే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు,ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విషయం చెప్పినా పట్టించుకోవటం లేదంటున్నారు.

> **డివిజన్ పరిధిలో వివరాలు**
>
> **డివిజన్ కాలనీలు:** యూపీహెచ్ కాలనీ, బాలజీనగర్‌లో కొంత భాగం, ఇండస్ట్రీయల్ ఏరియ, విద్యానగర్‌లో కొంత భాగం, అమరావతినగర్, పాండురంగాపురం రామాలయం వరకు, రాజీవ్‌నగర్ గుట్టు, మంచికంటినగర్, వేణుగోపాల్‌నగర్ అభయ వెంకటేశ్వర నగర్ కాలనీలు ఉన్నాయి.
>
> **జనాభా:** 9వేల జనాభా, ఓటింగ్ 5000
>
> **రేషన్‌షాప్:** రెండు, అంగన్‌వాడీ కేంద్రాలు నాలుగు.

డివిజన్‌కు స్మశానవాటిక కరువు

డివిజన్ పరిధిలో శ్మాశానవాటిక లేకపోవటంతో బల్లేపల్లి వైకుంఠధామానికి వెళుతున్నారు. రాజీవ్‌నగర్‌గుట్ట, మంచికంటినగర్‌లలో ప్రధానంగా ప్రభుత్వ భూమిలో కొన్నేళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. వాటికి ప్రభుత్వం నుంచి కొంత మందికి పట్టాలు రాగా మరికొందరికి రావాల్సి ఉంది. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో పువ్వాడ అజయ్‌కుమార్ మంత్రిగా ఉన్నప్పుడు రాజీవ్‌నగర్ గుట్టలో పేదలకు పట్టాలు అందించారు. కొందరికి పట్టాలు ఆలస్యం కావటంతో ప్రస్తుత నాయకులు దీనిపై అక్రమాలకు తెరలేపారు. కేసీఆర్ ఫోటోతో ఉన్న పట్టాకు రూ.20నుంచి రూ.30 వేలు తీసుకోని గత నెల రోజుల నుంచి కొందరికి పట్టాలు అందిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి.

బఫర్‌జోన్‌తో అభివృద్ధికి ఆటంకాలు

డివిజన్ పరిధిలో అభయవెంకటేశ్వరస్వామి ఆలయానికి ఇరువైపులా కొంతభాగంలో అధికారులు బఫర్ ఓన్‌గా ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణానికి పర్మిషన్లు రాకుండా ఉన్నాయి. ఐనప్పటికి కొందరు ఇంటినిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. వారికి కార్పోరేషన్ అధికారులు ఎలా పర్మిషన్లు ఇచ్చారో తెలియని పరిస్థితి. బఫర్‌జోన్ ఎత్తివేస్తే ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణాలు జరిగి, కార్పోరేషన్‌కు పన్నుల రూపంలో డబ్బు అధికంగానే వస్తాయి. ఈ ప్రాంతంలో 70ఎకరాలు బఫర్ ప్రాంతం ఉండటంతో బిల్డర్లు ఇంటి నిర్మాణాలకు ముందుకు రావటం లేదు.

రూ.5కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి

దండజ్యోతిరెడ్డి నాలుగో డివిజన్ కార్పొరేటర్



నాలుగో డివిజన్‌లో నాటిమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో డివిజన్‌లో రూ.3.5 కోట్ల అభివృద్ధి పనులు పూర్తిచేశా. ఇంకా రూ.5కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పూర్తిస్థాయిలో లేకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు. బఫర్‌జోన్ ఎత్తివేస్తే ఇంటి నిర్మాణాలు పుంజుకోని ఆదాయం సమకూరుతుంది.

వీధుల్లో చిమ్మచీకటి

యడెల్లి బిక్షం రాజీవ్‌నగర్‌గుట్ట



రాజీవ్‌నగర్‌గుట్టలో వీధిదీపాలు లేకపోవటంతో చిమ్మచీకట్లో బైటకు రాలేని పరిస్థితి. రోడ్లు, డ్రెయినేజీ లేకపోవటంతో మురుగునీరు రోడ్లపై నిలిచి జ్వరాల బారినపడుతున్నాం. బఫర్‌జోన్ ఎత్తివేస్తే ఇంటి నిర్మాణాలు పుంజుకుంటాయి. దీంతో ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చి అబివృద్ధి వేగంగా జరుగుతుంది.

దోమల, కుక్కల బెడద అధికంగా ఉంది

టీ శ్రీనివాస్, పాండురంగాపురం



పాండురంగాపురంలో డ్రెయినేజీ లేక వాడుకున్న నీళ్ల రోడ్లపై ఆగి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రిపూట కుక్కల దాడి చేస్తున్నాయి. డివిజన్ పరిధిలో పన్నులు అధికంగా వస్తున్నప్పటికి కార్పోరేషన్ అధికారులు ఆ దిశగా అభివృద్ధి పనులు చేయటంలో నిర్లక్ష్యంగానే ఉన్నారు. నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



తిరువమలాయపాలెం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులనుల బ్ధిదారులకు ఆదివారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి పంపిణీ చేశారు. 18మందికి చెక్కులను అందించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని బేబి స్వర్ణకుమారి, జిల్లాకాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్,నాయకులు తాటికొండ కిరణ్, యన్నం సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

నేడు నేలకొండపల్లిలో రక్తదాన శిబిరం

నేలకొండపల్లి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి)పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం రూరల్ సబ్-డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరాన్ని సీపీ సునీల్‌దత్ ప్రారంభిస్తారన్నారు. సేకరించిన రక్తాన్ని తలసీమియా బాధితుల కోసం ఉపయోగిస్తామన్నారు.

పొంగులేటి జన్మదినాన్ని విజయవంతం చేయండి: వెన్నపూసల

నేలకొండపల్లి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఉదయం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో నిర్వహించనున్నట్లు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు హాజరై విజయవంతం చేయాలని సీతారాములు ప్రకటనలో కోరారు.

ఎస్సీ కులాలను దెబ్బతీసేందుకే వర్గీకరణ

రఘునాథపాలెం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల మధ్య ఉన్న ఐక్యతను దెబ్బతీసేందుకే వర్గీకరణ ప్రక్రియ జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొట్టే సుదాకర్ ఆరోపించారు. రఘునాథపాలెం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 24న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. మండల కమిటీని నియమించారు. గౌరవ సలహాదారుగా రెంటాల ప్రసాద్, మండల అధ్యక్షుడుగా అంతోటి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా ఈర్ధాల లలితా రావు, ఇతర సభ్యులను నియామకం చేశారు.

సామాజిక స్పృహతో పనిచేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సామాజిక స్పృహతో పనిచేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయుల సదస్సు నిర్వహించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

డీఏ ప్రకటనపై టీఎన్జీవో నేతల హర్షం

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): అత్యంత క్లిష్ట సమయంలోను ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం డీఏను ప్రకటించడం హర్షనీయమని టీఎన్జీవో నాయకులు అన్నారు. ఆదివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ను కలిసి యుద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు భట్టిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేసారు. 3న ఖమ్మంలో జరిగే సకల ఉద్యోగుల సమ్మేళనం, వనసమారాధన కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. గుంటుపల్లి శ్రీనివాస్, దేవరకొండ సైదులు, మోదుగు వేల్కాద్రి, జయపాల్ విజయకుమార్, గంగవరపు బాలకృష్ణ, కొమరగిరి దుర్గాప్రసాద్, తాల్లూరి శ్రీకాంత్, ఎర్రా రమేష్, అంజనేయులు, పెద్దినేని రాధాకృష్ణ, సగ్గుర్తి ప్రకాశ రావు, రుక్మారావు, శంకర్, అస్లాం, మట్టా శ్రీను ఉన్నారు.

భట్టిని కలిసిన వీఆర్వోల సంఘం

గత పాలకుల నిరంకుశ విధానాల వలన, రాష్ట్రంలోని 5139మంది వీఆర్వోలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేయడం వలన సర్వీస్ ప్రొటెక్షన్, పేప్రొటెక్షన్ కోల్పోయినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వీఆర్వోల సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఆప్షన్ పద్ధతిలో వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకొని సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలంటూ భట్టికి వినతి

ఖమ్మంటౌన్: ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందచేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ భట్టికి వివరించాడు. మెస్ ఛార్జీలు పెంచాలని వినతిపత్రం ద్వారా కోరారు. 2014లోని ధరలకు అనుగుణంగా ప్రస్తుతం మెస్‌చార్జీలు ఇస్తున్నారని, అవి విద్యార్థులకు సరిపోవటం లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగిణి, పూజిత, శ్రీలత. వెంకటలక్ష్మి, మనోజ్, వినోద్ పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి భట్టిని కలిసిన గ్రానైట్ నూతన కమిటీ



ఖమ్మంఖానాపురంహవేలి:'దిఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోషియేషన్' నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన అందుబాటులో లేకపోవటంతో ఆదివారం నగరానికి విచ్చేసిన సందర్భంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ అద్యక్షులు పాటిబండ్ల యుగంధర్, ప్రధానకార్యదర్శి కమర్తపు గోపాలరావు, కోశాధికారి మారంరెడ్డి పరమేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు తమ్మినేని సాగర్, సంయుక్త కార్యదర్శి రియాజ్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఖమ్మంమామిళ్లగూడెం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్‌చంద్ర తన సభ్యత్వ కార్డు రెన్యువల్ చేసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.100తో సభ్యత్వ తీసుకుంటే రూ.5 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోన్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు బోడెపూడి రవి, రామాంజనేయ, కూచిపూడి జై,గంగవరపు ఆనంద్ కుమార్, వడ్లమూడి సాగర్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కామేపల్లి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం కామేపల్లిలో రైతు అజ్మీరా శంకర్ పత్తి చేను సందర్శించారు. ఖమ్మం, కారేపల్లిలో జిన్నింగ్ మిల్లులు ఉన్న పత్తికొనగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం భాదాకరమన్నారు. ఈ సందర్భనలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, టీడీపీ ఇల్లెందు నియోజకవర్గ నాయకులు పుచ్చకాయల సత్యనా రాయణ, కర్నాటి అశ్విన్, పుచ్చకాయల రామక్రిష్ణ ఉన్నారు.


సలాంకు కూనంనేని పరామర్శ

ఖమ్మంటౌన్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురైన సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు మహమ్మద్ సలాంను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఆదివారం సలాం ఇంటికి వెళ్లిన కూనంనేని ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సలాం త్వరగా కోలుకోని ఆకాంక్షించారు. ప్రజాఉద్యమాలకు నాయకత్వం వహించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కూనంనేని వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, యానాలి సాంబశివారెడ్డి, నూనె శశిధర్ తదితరులు ఉన్నారు.



రేపు మధిరలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం

మధిర, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మధిర ఆర్టీసీ డిపోలో ఈనెల 29తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం శంకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 99592 25961కు ఫోన్‌చేసి తమ సూచనలు తెలపాల్సిందిగా సూచించారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బోనకల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన రూ.11.10 కోట్ల నిధులతో వేయనున్న బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కలకోట ఉన్నత పాఠశాలలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఆర్డీవో గణేష్, రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఈఈ జ్ఞానేశ్వర్, ఏడీఏ విజయచందర్, పంచాయతీరాజ్ డీఈ కోటేశ్వరావు, ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ పున్నం చందర్, ఎంఈవో దామాల పుల్లయ్య పాల్గొన్నారు.


చింతకానిలో పార్టీలో చేరిన వారితో భట్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సీపీఐ నాయకులు యంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, తోట రామాంజనేయులు, ఆకేన పవన్‌లు అర్హులైన పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఆర్వోబీ బ్రిడ్జికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

చింతకాని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనంతసాగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నూతలపాటి వెంకటేశ్వర్లుతో పాటు సుమారు 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, కిలారు మనోహర్‌బాబు, చల్లా అచ్చయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు వీరయ్యను డిప్యూటీ సీఎం మండల పరిధిలోని నాగులవంచలో ఆదివారం పరామర్శించారు.

ముదిగొండ, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసుకోవటానికి ప్రజాప్రభుత్వం రూ.ఐదులక్షల సాయం అందించబోతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆదివారం


కలకోటలో సొసైటీ సభ్యులకు చేప పిల్లలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ముదిగొండ మండలంలోని చిరుమర్రి, ముదిగొండ, వెంకటాపురం, ఎడవల్లి, మాదాపురం గ్రామాల్లో రూ.19.95కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. అనంతరం ఎడవల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను ఏ కార్యక్రమం మొదలుపెట్టినా ఎడవల్లి యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆశీస్సులతోనే ఇక్కడ నుంచే ప్రారంభిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎడవల్లి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.4.74 కోట్లు మం జూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, మందరపు నాగేశ్వరరావు, రమేష్, అజయ్, వీరబాబు, ఝాన్సీ, బుచ్చిరామయ్య, కృష్ణ పాల్గొన్నారు.





స్నానాల లక్ష్మీపురం రోడ్డుకు మార్గం సుగమం


రోడ్డు నిర్మించే భూమిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రధాన రహదారి నుంచి కొంతకాలంగా నిలిచిపోయిన లింక్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి గత ఏడాది రూ.2.15కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డుకు జాతీయ ప్రధాన రహదారికి కొంతదూరం లింక్ లేకుండా పోయింది. అయితే భట్టి విక్రమార్క ఆదేశాలతో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవతో ఈ లింక్‌రోడ్డుకు అవసరమైన భూమిని ఇచ్చేందుకు యజమాని బాలకృష్ణ అంగీకారం తెలిపారు. దీంతో స్వయంగా ఎమ్మెల్యే భూమి యజమాని బాలకృష్ణతో కలిసి భూమికి సంబంధించిన పంచాయతీరాజ్ అధికారులతో కలిసి ఆదివారం హద్దులు నిర్ణయించారు. 40అడుగుల వెడల్పు, 600అడుగుల పొడవుతో నిర్మించనున్న ఈ రోడ్డుకు దాదాపు రూ.2కోట్ల విలువైన 0.22ఎకరాల భూమిని యజమాని బాలకృష్ణ ప్రభుత్వానికి అప్పగించారు. గతంలో రూ.2.15కోట్లుగా ఉన్న రోడ్డు అంచనాలను రూ.3.25కోట్లకు పెంచుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్, పీఆర్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ ప్రదీప్ పాల్గొన్నారు.

కల్లూరులో వైభవంగా కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

కల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని పెద్దచెరువు కట్టపై వేంచేసి ఉన్న శివాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కనకదుర్గదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని వేదపండితులు కంభంపాటి అనిల్ శర్మ నేతృత్వంలో వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠాపన చేశారు. అంతకు ముందు అమ్మవారి విగ్రహాన్ని పురవిధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా యజ్ఞ యాగాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు దాతలు పోట్రు కృష్ణయ్య, సూరమ్మ దంపతులు తమ వంతుగా రూ. 23 లక్షలు వితరణ చేశారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్కినేని నరిసింహారావు, ప్రధాన కార్యదర్శి వలసాల సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ బయ్యారపు న రేందర్, మాధవరెడ్డి, వలసాల మోహనరావు, బాలకృష్ణ, ప్రత్యూష తదితరులున్నారు.

విరాళం అందజేత

సత్తుపల్లిరూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయానికి పట్టణానికి చెందిన వంగరి పద్మారావు, వసంతరాణి దంపతులు రూ.1,11,116విరాళాన్ని అందించారు. ఆదివారం ఆలయాన్ని దర్శించుకున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా దాతలను ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లిఖార్జున శర్మ, సోమిశెట్టి శ్రీధర్, రాగాల చంద్రారెడ్డి, గాదె నాగు, ఉబ్బల వెంకటేశ్వరరావు, రాగాల రమేష్‌రెడ్డి తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేత

బోనకల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, భాగం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భాగం రాకేష్ ఆదివారం ఇంటర్ విద్యార్థినికి రూ.10వేల నగదు సాయాన్ని అందించారు. సరిహద్దు గ్రామమైన ఎన్టీఆర్ జిల్లా కాకరవాయికు చెందిన లంకజ్యోతి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 463 మార్కులను సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె చదువును ప్రోత్సహించేందుకు గానూ రాకేష్ సాయం చేశారు. చదువుల్లో రాణించే విద్యార్థులకు తమ ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



ఆహార నియమాలతో సంపూర్ణ ఆరోగ్యం

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందిని


జ్యోతిప్రజ్వలనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్, మల్లు నందిని

వైరా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి, అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పేర్కొన్నారు. డాక్టర్ కామిశెట్టి సుబ్బారావు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కేవీ.కృష్ణారావు జ్ఞాపకార్థం ప్రకృతి ఆరోగ్యంపై ఆదివారం డైట్ గురువు వీరమాచినేని రామకృష్ణతో నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి సు బ్బారావు, రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పాలేటి నర్సింహారావు, పాల్గొన్నారు.

జామా మసీద్ అధ్యక్ష,కార్యదర్శులకు సన్మానం

సత్తుపల్లి, అక్టోబర్27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని జామా మసీద్, మార్కెట్ మసీద్ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్‌కే.నాయబ్ రసూల్, ఎండీ.కమల్‌పాషాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి ఇరువురిని అభినందిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌లు ప్రత్యేకంగా సన్మానించారు. ముస్లిం మతపెద్దలను గౌరవిస్తూ వారి కుటుంబాల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ క్రమంలోనే త్వరితగతిన నిధులు మంజూరు చేయించి షాదీఖానా నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో.. అధ్యక్షుడిగా పసువర్తి నేడు నామినేషన్


పసుమర్తి చందర్‌రావు

కల్లూరు, అక్టోబరు 27 ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికల్లో కల్లూరుకు చెందిన పసుమర్తి చందర్‌రావు సోమవారం ఖమ్మంలో నామినేషన్ వేయనున్నారు. కల్లూరు ప్రాంతం నుంచి చందర్‌రావు గత 40ఏళ్ల నుంచి రాజకీయంగా ఎంతో అనుభవం, ప్రజా సంబంధాలు కలిగి మంచి గుర్తింపు పొందారు. అదే విధంగా ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర జిల్లా కమిటీల్లో కూడా గతంలో ఆయన అనేక పదవుల్లో ప్రాతినిధ్యం వహించారు. చందర్‌రావు సామర్థతను పరిగణలోకి తీసుకున్న జిల్లాలోని పలు మండలాల ఆర్యవైశ్య కమిటీలు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మానించాయని తెలిసింది. నవంబరు 3న జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ఆయన ఎంపిక దాదాపుగా ఖారారు కానున్నది. ఖమ్మంలోని గుట్టల బజారులోని శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అధ్యక్ష పదవికి కల్లూరు నుంచి చందర్‌రావు నామినేషన్ వేయనున్నట్లు తెలిసింది. ఈ ఎన్నికకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు దోసపాటి వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా కల్లూరు ప్రాంతం నుంచి సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, మండలాల పరిధిలో గల ఆర్యవైశ్య ప్రముఖులందరు భారీ ర్యాలీతో సోమవారం ఉదయం 9 గంటలకు ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లనున్నారు.

సెలవుల్లో వంట వండించిన హెచ్‌ఎం సస్పెన్షన్

సత్తుపల్లిరూరల్, అక్టోబర్27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని పాతసెంటర్ ఎంపీపీఎస్‌లోని ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో సోమశేఖరశర్మ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. దసరా సెలవులలో ఈనెల 9వ తేదీన పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికుల నిర్వాహకులతో తనసొంత పని కోసం వంట కార్యకలాపాలకు వినియోగించుకున్నందుకుగానూ ఆయనను సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. వార్తా పత్రికలలో కథనాలు, సామూహిక విచారణ నివేదిక ఆధారంగా అతడి అవసరాల కోసం దసరా సెలవుల్లో వంట కార్యకలాపాలు చేయించడం చట్టబద్ధమైన విధులను నిర్వహించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతుందని, అందుకే హెచ్‌ఎంపై ఉన్నతాధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లుగా ఎంఈవో నక్కా రాజేశ్వరరావు తెలిపారు. కాగా ఇదే హెచ్‌ఎం ఇదే పాఠశాలలో పనిచేస్తూ గతంలో ఓసారి సస్పెన్షన్‌కు గురవ్వగా, మళ్లీ రెండోసారి సస్పెండ్ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఊటవాగు ఆదివాసిగూడేనికి అంగన్‌వాడీ కేంద్రం


ఎస్ఐ రామారావు చొరవతో నిర్మాణమైన అంగన్‌వాడీ కేంద్రం

కారేపల్లి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కారేపల్లి, కామేపల్లి మండలాల సరిహద్దులోని ర్రబోడు గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో అడవిలో ఎటువంటి రవాణా సౌకర్యం లేకుండా ఉన్న ఊటవాగు అదివాసీ గూడేంలో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేశారు గతంలో మండల ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం ఖమ్మంరూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పుష్పాల రామారావు చొరవతో అంగన్‌వాడీ కేంద్రం శనివారం ప్రారంభించారు. గ్రామంలో 26గుడిసెలతో 100వంద మంది వలస కూలీలు గత17 సంవత్సరాలుగా ఉంటున్నారు. పలుమార్లు అదివాసిగూడేనికి వెళ్లిన ఎస్ఐ అక్కడ పిల్లలకు ఏలాంటి పాఠశాల సౌకర్యం లేకపోవడంతో ఎలాగైనా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఖమ్మం పట్టణానికి చెందిన విద్యుత్‌శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన కొంగర రామచంద్రరావు దృష్టికి తీసుకవెళ్లారు. అయితే ఎన్ఆర్ఐ అయిన రామాచంద్రరావు కుమారుడు కొంగర వెంకటరామారావు సహకారంతో లక్షా ఇరువై వేల రూపాయలతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇదే విషయాన్ని ఐసీడీఎస్ సీడీపీవో దయమణి దృష్టికి తీసుకవెళ్లారు. స్పందించిన ఆమె అంగన్‌వాడీ కార్యకర్తను ఏర్పాటు చేశారు. కేంద్రానికి వచ్చే పిల్లలతో పాటు గ్రామంలోని మహిళలకు పౌష్టికాహారం అందించేలాచేశారు. ఈవిషయం పై ఎస్ఐ రామారావు చేసిన కృషిని, ఎన్ఆర్ఐ సహకారంపై పలువురు అభినందించారు.

పుల్లయ్య అరెస్ట్‌ను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

చింతకాని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చింతకాని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం ఆయన స్వగ్రామం పొద్దుటూరులో కొవ్వొత్తులతో గ్రామస్థులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. సుమారు 700 మంది గ్రామస్థులు ర్యాలీలో పాల్గొని పుల్లయ్యపై ఉన్న అభిమానాన్ని చాటారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన మంచిపనులే ఆయనకు అండగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పెనుబల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో వీఎంబంజర్ జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 425మంది వైద్య చికిత్సలు పొందారు. మారుమూల గ్రామాలకు వచ్చి ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ వైద్యసిబ్బంది ప్రజల ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు ఇవ్వడం పట్ల గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ భీమిరెడ్డి బాబురెడ్డి, చావా శివరామకృష్ణ, వైద్యసిబ్బంది, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



